దసరా ఉత్సవాల్లో కొత్త ఒరవడి

- పందిళ్లలో అమ్మవారి విగ్రహాల ప్రతిష్ట
- నవరాత్రులలో రోజుకో అలంకారం
- ప్రత్యేక పూజలు.. నిమజ్జనం

కడప కల్చరల్ : దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కొత్త ఒరవడిని సంతరించుకుంటున్నాయి. దసరా ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తున్నారు.ఇంత వరకు మన ప్రాంతంలో లేని విధంగా.. పందిళ్లలో విగ్రహాలకు పూజలు నిర్వహించే పద్ధతి కనిపిస్తోంది. మన ప్రాంతంలో అమ్మవారి ఆలయాలలో మాత్రమే ఉత్సవ మూర్తులకు లేదా ప్రత్యేక విగ్రహాలకు రోజుకొక అలంకారం చేస్తారు. కానీ ఇటీవల ఈ పద్ధతిలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇంత వరకు కేవలం ఉత్తరాది రాష్ట్రాలు, హైదరాబాదుకు పరిమితమైన భారీ విగ్రహాల పద్ధతి మన ప్రాంతంలో కూడా కనిపిస్తోంది. ఇప్పటి వరకు కొన్ని చోట్ల వినాయక చవితికి చేసినట్లు పందిళ్లు నిర్మించి 6 నుంచి 12 అడుగుల అమ్మవారి మట్టి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటికి 10 రోజులపాటు రోజుకో అలంకారం, పూజలు నిర్వహిస్తారు. దేవాలయాలకు సంబంధం లేకుండా వినాయక చవితి లాగా వీధి కూడళ్లలో ఇలాంటి విగ్రహాలను నిలుపుతున్నారు. ఈ పద్ధతి కేవలం వినాయక చవితికి మాత్రమే పాటించేవారు. కానీ హైదరాబాదులో నివసిస్తున్న మన ప్రాంతాల వారు కొందరు ఆ పద్ధతులను ఇక్కడ కూడా పరిచయం చేస్తున్నారు. హైదరాబాదుతోపాటు ఉత్తర ప్రాంతాలలో వినాయక చవితికి వేసిన పందిళ్లనే దసరా వరకు కొనసాగిస్తుంటారు. గణపతి విగ్రహాల స్థానాల్లో అమ్మవారి విగ్రహాలు నిలిపి పూజలు చేస్తారు. ఇటీవల ఇక్కడి వారు కొందరు ఈ కొత్త పద్ధతిని మన ప్రాంతానికి పరిచయం చేస్తున్నారు. రెండు, మూడేళ్లుగా ఒకటి, రెండు ప్రాంతాలకే పరిమితమైన ఈ పద్ధతి ప్రస్తుతం నగరంలో 12 చోట్ల అమలు చేస్తున్నారు. కడప నగరంలోని చిన్నబెస్త వీధిలోని బాల పోలేరమ్మ ఆలయం, ఎన్జీఓ కాలనీ నల్లరాతి మిద్దె సమీపంలో, శంకరాపురం ఎస్‌బీఐ ప్రాంతం, బాలాజీనగర్, గాంధ్లవీధి, దేవునికడపలో రెండు చోట్ల, మరికొన్ని ప్రాంతాల్లో ఈ పద్ధతిని అమలు చేస్తున్నారు. వినాయక చవితి లాగానే అమ్మవారి విగ్రహాలకు తొమ్మిది లేక పది రోజులు పూజలు చేస్తున్నారు. అనంతరం భారీ ఊరేగింపుతో చెరువులు, కాలువలు, ఏర్ల వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తున్నారు. ఈ పద్ధతి కొత్తగా ఉండడంతో సమీప భక్తుల నుంచి ప్రోత్సాహం లభిస్తోంది.


శంకరాపురం ఎస్‌బీఐ సమీపంలోని పందిరిలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు


ఎన్జీఓ కాలనీ మృత్యుంజయకుంటలో అమ్మవారి మట్టి విగ్రహం

ఆలయాలు లేని చోట..

హైదరాబాదులో ఈ పద్ధతిని చూశాను. అక్కడి నుంచి విగ్రహం తీసుకొచ్చి ఇక్కడ పూజలు నిర్వహిస్తున్నాను. అమ్మవారి ఆలయాలు లేని చోట పందిళ్లు వేసి పూజలు చేస్తున్నాం. ఖర్చు ఎక్కువ అయినా భక్తులకు సౌకర్యంగా ఉంది. 12వ రోజున నిమజ్జనం చేస్తాం.

– గోవర్ధన్, శంకరాపురం,కడప

అందరికీ అందుబాటులో..

నగరంలో దూర ప్రాంతాల భక్తులు అమ్మవారి ఆలయాలకు రాలేక పోతున్నారు. అలాంటి వారికి సమీప వీధుల్లో అమ్మవారి దసరా అలంకార దర్శనభాగ్యం కల్పించడం మంచిదే. భక్తిభావం మంచిని, నైతిక విలువలను పెంచుతుంది.

– బిస్తవేముల రామమహేష్, పొట్టిశ్రీరాములవీధి, కడప



దేవుడే నిజనిర్ధారణ చేస్తాడు



రాజకీయ లబ్ధికోసం ప్రపంచంలోని భక్తులంతా ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డుపై ఆరోపణలు చేయడం అత్యంత హీనమైన చర్యగా భావిస్తున్నాం. దీన్ని ప్రజలే కాదు... ఆ ఏడు కొండల వాడు కూడా గమనిస్తున్నాడు. ఫలితంగా సుప్రీంకోర్టు మొట్టికాయలు తినాల్సి వచ్చింది. – **బిస్తవేముల రామమహేష్, వీహెచ్‌పీ ప్రాంతీయ సంఘటన్ ప్రముఖ్, కడప**

'సుప్రీం' తీర్పు ప్రశంసనీయం



సుప్రీంకోర్టు మరోసారి తన ఔన్నత్యాన్ని చాటుకుంది. రాజకీయ క్రీడలో లబ్ధి పొందాలనుకున్న వారికి ఆ దేవదేవుడు చెంపపెట్టు వేశారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగి లబ్ధి పొందాలని భావించే వారు తగిన ఫలితం అనుభవించక తప్పదు. **– సట్టి భారవి, న్యాయవాది, పుష్పగిరి తీర్థ క్షేత్ర పరిరక్షణ సమితి అధ్యక్షులు, కడప.**

అమ్మా.. శాంభవీ.. అన్నపూర్ణా..

కడప కల్చరల్ : శరన్నవరాత్రి ఉత్సవాలు మూడవ రోజున శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. నగరంలోని అమ్మవారి ఆలయాలన్నీ విద్యుద్దీప కాంతులతో ‘నవరాత్రి’ శోభతో ఉట్టిపడుతున్నాయి. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. సాయంత్రం 6 గంటలకే నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారాలలో కొలువుదీర్చారు. భక్తుల సంఖ్య ఎక్కువ కావడంతో దర్శనాల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. సాయంత్రం నుంచి ఆలయాల సమీప వీధులు జనసంద్రాలయ్యాయి. కడప నగరంలోని అమ్మవారిశాలలో శ్రీ అన్నపూర్ణగా కన్యకాంబను కొలువుదీర్చారు. శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో చంద్ర ఘంట అలంకారం, గడ్డిబజారు సత్యదేవుని ఆలయంలో స్వామిని శ్రీ వెంకటేశ్వరునిగా అలంకరించారు. చిన్నబెస్తవీధిలోని బాలపోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి గజలక్ష్మి అలంకారం నిర్వహించారు. నగర శివార్లలోని శ్రీ లలితాంబిక ఆలయంలో గాయత్రీదేవిగా అలంకరించారు. నడివీధి గంగమ్మను పార్వతీదేవిగా అలంకరించారు. దేవునికడపలో చంద్రప్రభ వాహనంపై కడపరాయుడిని ఉభయ దేవేరులతోసహా కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. ఎర్రముక్కపల్లె చౌడేశ్వరీదేవిని గజలక్ష్మిగా అలంకరించారు. అలాగే ఇంకా పలు గంగామాత ఆలయాలు, చౌడేశ్వరీమాత ఆలయాలలో విశేష అలంకారాలను దర్శించేందుకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.


గజలక్ష్మిదేవిగా శ్రీ బాలపోలేరమ్మ


పార్వతీదేవిగా నడివీధి గంగమ్మ


చంద్రఘంట అలంకారంలో శ్రీ విజయదుర్గాదేవి


చంద్రప్రభ వాహనంపై కడప రాయుడు


శ్రీ మీనాక్షిదేవిగా కామకోటి కళాంబదేవి


వెంకటేశ్వరస్వామిగా లక్ష్మీసత్యనారాయణస్వామి


అన్నపూర్ణదేవిగా శ్రీ కన్యకా పరమేశ్వరి

క్లుప్తంగా

శిల్పారామంలో దసరా స్పెషల్

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో దసరా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నామని సంస్థ పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. ఎప్పటిలాగా దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 6, 11, 12, 13 తేదీలలో ఈ కార్యక్రమాలు ఉంటాయని, ప్రముఖ డ్యాన్స్ మాస్టర్లు, టీవీ యాంకర్లచే ఆకర్షణీయమైన నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం కడపకు చెందిన కిశోర్ డ్యాన్స్ అకాడమి, 11న విజయశాంతి బృందం ముద్ర డ్యాన్స్ అకాడమి, 12న పులివెందుల ఎస్కే డ్యాన్స్ అకాడమి, 13న కమలాపురం ఆర్కే డ్యాన్స్ అకాడమి ప్రతినిధులతో నృత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

‘సెలవుల్లోనూ కళాశాలల నిర్వహణ’


ఇంటర్ ఆర్జేడీకి వినతిపత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : దసరా సెలవుల్లో కూడా ఇంటర్‌బోర్డు నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనాథ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం ఇంటర్ ఆర్జేడీని కడపలోని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థులకు, అధ్యాపకులకు దసరా సెలవులు ఇవ్వకుండా రాయలసీమ పరిధిలోని జిల్లాలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ విషయంలో స్పందించి ఆయా కళాశాలలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి అన్నమయ్య, కర్నూలు, అనంతపురం జిల్లా నాయకులు ముబారక్ బాషా, రైవస్, తేజ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్‌కు 30 రోజులు, ఫోటో, వీడియోగ్రఫీలో 30 రోజులు, సీసీ కెమెరా రిపేరింగ్, సర్వీసింగ్‌కు 13 రోజులు శిక్షణ ఇస్తారన్నారు. 18–45 సంవత్సరాలలోపు వయసు కలిగిన యువకులు ఇందుకు అర్హులన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866, 94409 33028 నంబరులో సంప్రదించాలన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


ఇంటింటి చెత్త సేకరణ పనులు పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర పరిశీలించారు. శనివారం నాగరాజుపేట, పాతబస్టాండు, సన్‌రైజ్ హాస్పిటల్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కార్మికులకు కేటాయించిన ప్రాంతాల్లో విధులకు హాజరై ఆయా ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. కార్మికుల హాజరు పట్టికలను పరిశీలించి, అందరూ యూనిఫారం ధరించాలని సూచించారు. మెయిన్ రోడ్లను ఉదయాన్నే ఊడ్చాలని, రద్దీ లేని సమయంలో పాతబస్టాండును శుభ్రపరచాలన్నారు. ప్రజలు తమ ఇంటిలో వచ్చిన చెత్తను తడి, పొడి చెత్తలుగా విభజించి వాహనాలకు అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న ట్రాఫిక్ పోలీస్ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించాలని ట్రాఫిక్ సీఐ జావేద్ అన్నారు. ఆర్‌ఆర్ అసోసియేషన్ వారు ట్రాఫిక్ నిబంధనలపై ముద్రించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల నుంచి కడప నగరంలో ఆర్‌ఆర్ అసోసియేషన్ వారు ట్రాఫిక్ నిబంధనపై కరపత్రాలు పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ ప్రసాద్, రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ కరీముల్లా రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయులకు అవార్డులు


అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో నిర్వాహకులు

కడప ఎడ్యుకేషన్ : ఏటా రబ్బీవుల్ అవ్వల్ మాసాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్(ఐటా) కడప శాఖ ఆధ్వర్యంలో ఆదర్శ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఐడియల్ టీచర్ అవార్డుతో సన్మానిస్తున్నట్లు ఐటా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అబ్దుల్ రజాక్, జాతీయ కార్యదర్శి ఎస్.షాకీర్ హుస్సేన్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి శనివారం కడప బెల్లంమండి వీధిలోని మదరస జేహరాలోని కాన్ఫరెన్స్ హాల్లో ఐడియల్ టీచర్ అవార్డులు ప్రదానం చేశారు. అదే విధంగా ఇంటర్మీడియెట్ నుంచి పీజీ విద్యార్థులకు మహమ్మద్ ప్రవక్త (స.అ.స) జీవిత చరిత్రపై తెలుగు, ఉర్దూ, ఆంగ్లభాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు మెమొంటోలు, పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయవాడ నుంచి విచ్చేసిన ముజాహిద్ ఖాన్ ఉమ్రి మాట్లాడుతూ అన్ని విషయాలలో ఆదర్శవంతంగా ఉన్నప్పుడే ప్రతి ఉపాధ్యాయుడు ఆదర్శ ఉపాధ్యాయులవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షాజియా బేగం, ఐటా జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు నజీర్, అబ్బాస్ అలీతోపాటు 200 మంది ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకగా బతుకమ్మ సంబరాలు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ సంబరాలను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బతుకమ్మ పండుగ ప్రత్యేకమైనదని, పూలను పూజించే సంస్కృతి ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. పూలరూపంలో ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ అని, తెలంగాణ ప్రాంతానికి పరిమితమైన బతుకమ్మ వేడుకలను ఆంధ్రప్రదేశ్‌తోపాటు ప్రపంచంలోని పలు దేశాల్లో సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ఎస్.రాజేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మనిషికి, ప్రకృతికి మధ్య బంధాన్ని తెలియజేసే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో విచ్చేసి దాండియా నృత్యాలతో సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఏఎఫ్‌యూలో బతుకమ్మ సంబరాలు

మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీంబాషా తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు నేరుగా కళాశాలకు హాజరు కావచ్చని ఆయన పేర్కొన్నారు. పొలిటికల్ సైన్స్, హిస్టరీ, స్పెషల్ ఉర్దూ, స్పెషల్ ఇంగ్లిష్, ఎకనామిక్స్, బీకాం, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమాటిక్స్, స్టాటిస్టిక్స్, డాటాసైన్స్ విభాగాల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల బీమా సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల ప్రభుత్వ సామూహిక జీవిత బీమా సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం కడపలోని జీవిత బీమా కార్యాలయంలో కార్యాలయ సూపరింటెండెంట్ తస్లీమా సుల్తానాకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజీఎల్ఐ బాండ్ల గడువు తీరినటువంటి ఉపాధ్యాయులకు చివరి మొత్తాలను చెల్లించడంలోనూ.. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇవ్వడంలోనూ సంవత్సరాల తరబడి జాప్యం జరుగుతోందన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన ఉపాధ్యాయులకు రావాల్సిన చివరి మొత్తాలను వారి కుటుంభ సభ్యులకు చెల్లించడంలో కూడా తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల ఖాతాలకు జమకాని మొత్తాలను వారి అకౌంట్లకు జమచేయాలని అన్నారు. అలాగే ఏపీజీఎల్ఐ నూతన బాండ్ల జారీలో ఏర్పడిన సాంకేతిక సమస్యలను సరి చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసులురెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేష్‌రెడ్డి, నారాయణరెడ్డిలతో పాటు కార్యాలయ సిబ్బంది అరుణ, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రాయశ్చిత్తం అంటే ఏమిటో పవన్‌కు తెలుసా?



సమావేశంలో మాట్లాడుతున్న కమలాపురం వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి


- వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు కుట్ర
- తిరుమల లడ్డూపై అసత్య ప్రచారం
- కమలాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రాయశ్చిత్తం అంటే ఏమిటో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు తెలుసా? అని కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి ప్రశ్నించారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గత వంద రోజుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని తీసుకొచ్చారన్నారు. ఎవరైనా తప్పు చేస్తే ప్రాయశ్చిత్తం చేసుకుంటారని, పశ్చాత్తాప దీక్ష చేసిన పవన్ కల్యాణ్ తప్పు చేశారని ఒప్పుకుంటున్నారా అని నిలదీశారు. ఆగమ సలహా మండలి సలహాలతోనే పవన్ దీక్ష చేశారా అని ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా, నిర్ధారణ చేసుకోకుండా కల్తీ మాటలు మాట్లాడినందుకు సుప్రీంకోర్టు ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిందన్నారు. పవన్ కల్యాణ్ తనను తాను ఒక సారి క్రిస్టియన్‌గా, నాస్తికుడిగా చెప్పుకుంటాడని, ఇలాంటి వ్యక్తి సనాతన ధర్మాన్ని కాపాడతారా? అన్నారు. సనాతన ధర్మానికి చాంపియన్ కావాలని, ఆ ధర్మానికి ఆయన తూట్లు పొడుస్తున్నారన్నారు. సనాతన ధర్మంలో నిజం మాట్లాడాలని ఉందని, వీళ్లు అబద్ధాలు చెప్పి సనాతన ధర్మాన్ని వాడుకుంటున్నారన్నారు. సనాతన ధర్మం పేరుతో పవన్ కళ్యాణ్ మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. అధికారమదం, అహంకారంతో తోటి సినీ నటులను కూడా నోటికొచ్చినట్లు మాట్లాడటం దారుణమన్నారు. సనాతన ధర్మాన్ని తన స్వార్థ ప్రయోజనాల కోసం, రాజకీయాలకు వాడుకోవడం తగదని సూచించారు. పవన్‌కు దమ్ముంటే రేపు జరిగే కేబినెట్ మీటింగులో వారాహి డిక్లరేషన్ పెట్టి ఆమోదించాలన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసం దేవుడ్ని కూడా వాడుకోవడం తగదన్నారు. జనహితమే వైఎస్సార్‌సీపీ అభిమతమని, మానవత్వమే జగనన్న మతమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు, జి.శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి ఇస్రో స్పేస్ వీక్

కడప ఎడ్యుకేషన్ : కేఎస్ఆర్ఎం, ఇస్రో సంయుక్తంగా ఈ నెల 7వ తేదీ నుంచి 9 వరకు కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో వరల్డ్‌స్పేస్ వీక్– 2024 కార్యక్రమంలో భాగంగా స్పేస్ – వెదర్ చేంజ్ అనే థీమ్ నిర్వహిస్తున్నట్లు కేఎస్ఆర్ఎం ప్రిన్సిపాల్ వీఎస్ఎస్మూర్తి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా సైన్స్ ఎగ్జిబిషన్, ఎలక్యూషన్, ఎస్సే రైటింగ్, షార్ట్ ఫిల్మ్, సైన్స్ మోడల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివే విద్యార్థుల వరకు అందరూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు. 7వ తేదీ ప్రారంభం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, షార్ డైరెక్టర్ రమేష్ బాబు హాజరవుతారని తెలిపారు. ఇలాంటి స్పేస్ వీక్ ఎగ్జిబిషన్ వల్ల పిల్లలకు సృజనాత్మక ఆలోచనలు ఉద్భవించే అకాశం ఉంటుందని, దీంతోపాటు వారి ఆలోచనా విధానం పరిశోధనల వైపు అడుగు పడుతుందని కందుల విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్రఓబుల్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలనే సంకల్పంతో కల్చరల్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వీర శంకర్, కాలేజ్ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సురేష్‌బాబులు 6వ తేదీ ఆదివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు కడప కోటి రెడ్డిసర్కిల్ నుంచి కొత్త బస్టాండ్ సెంటర్ వరకు స్పేస్ వీక్ సెలబ్రేషన్ ర్యాలీ నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ వీఎస్ఎస్మూర్తి కోరారు.

కాంగ్రెస్‌తోనే లౌకిక ప్రజాస్వామ్య మనుగడ


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షల మేరకు పని చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి అన్నారు. శనివారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్లో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేలా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మాజీ ఉపాధ్యక్షులు బండి జకరయ్య, మాజీ పీసీసీ కార్యదర్శి సిరాజుద్దీన్, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, మామిళ్ళ బాబు, గౌస్ పీర్, మైనుద్దీన్ పాల్గొన్నారు.